# వెలుగు

**And the God satd:**
**Let there be light**
**And there was light**

అతడు బాగా వెనక్కు జరిగి, నిల్చుని చూచాడు.

ఇంకో మూలకు వెళ్ళి చూచాడు.

ఆ చూడడం మామూలు చూడడం కాదు.

ఒళ్ళంతా కళ్ళయి చూడడం.

చిన్న సవరణ అవసరమనిపించింది.

కుంచెను చేతిలోకి తీసుకున్నాడు.

ఊదారంగులోకి ముంచి తీశాడు

ముందుకు నడిచాడు.

చిత్రం దగ్గరగా వెళ్ళాడు.

ఆమూలగా–ఆ పసుపు ఎరుపులు కలిసినచోట కొద్దిగా అద్దాడు.

మళ్ళీ దూరం నుంచి పరిశీలించాడు.

పరిశీలిస్తూ నిలబడ్డాడు.

పంచేంద్రియాలతో చూస్తూ నిలబడ్డాడు.

అక్కడే నిలబడే వున్నాడు

అతడక్కడ వుండగానే, హఠాత్తుగా అతన్లోంచి అతడె లేచి
తూలుతూవెళ్లి ఆ విశాలమైన వర్ణచిత్రాన్ని కౌగలించుకున్నాడు.
ఆ రంగులమీద మొహాన్ని ఆనించి కళ్ళుమూసుకున్నాడు.
అది తన గర్భం
అది తన హృదయం.
అది తన మనోకోశం.
అందులో సాక్షాత్కరించిన శిశువు ఆ చిత్రం.
ఆ నాడు, ఆ మొదటినాడు -
తనకీ తెలియని ఏదో సంయోగం తన లోపల జరిగిననాడు -
ఏ స్పెర్మ్ ఈదుకుంటూ ఏ దిగంతాలకీ వెళ్ళి ఏ ఓవంతోనో లీన
మయిందని –

తెలియని ఆ నాడు -
ఆ మొదటి నాడు -
లో లోపల
తన లోపల
ఏదో ఏదో కదులు తుందడమే తెలుసు.
కొంతకాలానికి అది తానే అయినా తానుకాదనీ -
అయినా తనదేనని
ను దానిదేనని తెలుసు
తల్లిగా ఆ బరువు ఇంకెవరికెలా తెలుస్తుంది
తన కొక్కరికే తెలుసు –
ఆ చైతన్యం ఇంత దింతయై
అల్లంతయై

రూపులు సంతరించు కుంటున్న క్షణాలల్లో
రేఖలు దిద్దుకుంటున్న యుగాలలో
అబ్బా ! అదేమిటది ఆ బరువు ?
ఆనందం బరువా ?
బరువైనది ఆనంద మెలా అవుతుంది ?
బరువుకాదది, తనఅశక్తత, బలహీనత –
ఆనంద మయాన్ని మోయలేని అసీమియా ....
అప్పటికప్పుడే, ఆ వెను వెంటనే
ఆ ఆనందాన్ని దించాలని, అందించాలని, అందుకోవాలనీ,
దాన్ని-ఇది అని చెప్పాలని, కుదించాలని, చిత్రించాలని
వెదుకాడగ పోతే
గాలమే మిగిలింది; ఎదురుతిరిగి గుండెలోకి చొచ్చుకుంది.
అయ్యో ! ఏమయిం దేమయింది ...
నా ప్రాణం-నా పాప- నా జీవం - నా నావ- నా సర్వస్వం
ఏమయింది, ఎటుపోయింది !
అమ్మయ్య....లేదు....పోలేదు.
అదిగో కదలు తున్నది.
ఉంది. ఎక్కడికీ పోలేదు. తనలోనేవుంది.
దాని లోపలే తనూ -
అది లేని తాను,
వేణువుకాదు - వెదురుముక్క !
- మరయితే నా పాపా !
నా చిట్టి తల్లీ ! బంగారు తండ్రీ !

ఎన్నాళ్ళమ్మా ఈ దాగుడు మూతలు ?
ఎన్నాళ్ళయ్యా ఈ మన వియోగం -
నా కంట పడవా ?
నా ఎదుట నిలవవా ?
నా చేతులార నిన్నెత్తుకుని, ఎగరేసి, ముద్దుపెట్టుకుని
నీకు తలంటిపోసి, బంగారు మొలతాడూ పట్టుదట్టీకట్టి.
కాటుక రేఖలు దిద్ది నిన్ను నా ఎదలోకి పొదువుకునేదెన్నడు ?
ఎన్నడమ్మా ఎన్నడు ?
నేను యశోదనై నువ్వు కిష్టుడై
నువ్వు ఏసువై నేను మేరీనై
తనివితీరా ముద్దాడే దెన్నడు ?
ఆర్తితో ఆబతో తపనతో తాపంతో
కొట్టుకులాడగా ఆడగా
ఆ భావానికి ఆ రూపానికి
నవరసాలూ నిండాక,
అది దశ దిశలూ వ్యాపించాక
'తదన్త రస్య సర్వస్య
తదు సర్వాసాస్య బాహ్యతః' - గా అయ్యాక
ఒక పట్టపగలు, మిట్టమధ్యాహ్నం
కటిక చీకటయింది.
కడుపులో ఫ్యుజియామా ఎగసింది.
హృదయంలో 'బాస్టిలీ బద్దలయింది.
సహస్రారం ఒక్కపాదం పైకెత్తింది.

శివతాండవమట !
శివా లాస్యంబట !
ఓహో హో ....
వేదన
ఆవేదన
మనసు పేగులు తెగిపోతున్న కోత -
దారితెలియని గుడ్డివాడి ఆందోళన -
మాటలురాని మూగతనపు ఆక్రోశం -
అంతరాంతరాలలో బడబానలం -
ఆ చీకటిని చించుకుని హఠాత్తుగా ఒక మెరుపు
ఆ హాలహాలపు భుగ భుగల మధ్య అమృతకలశం -
తాను మరణించాడు.
ఆ చిత్రం పుట్టింది.
ఆ చెమట అలసట
అ కష్టం సుఖం
ఆ మరణం ప్రసవం
- నా మనసు పొత్తిళ్ళల్లో అరుణోదయం
'ఇదమ్ ఉత్యత్ పురుతమం పురస్తాజ్
జ్యోతి స్తమో వయునా వదస్తాత్
న్యూనం దివో దుహితరో విభాతిర్
గాతుం త్రణవణ్ ఉషసో జనాయ' ....
- అనుకుంటున్న అతడి కనుల వెంబడి అశ్రువులుజారి
జాలువారి నేలతల్లితో ఊసులాడుతున్నాయి.

నిండుగా నెమ్మదిగా బరువుగా
కదిలాయి అతడి పాదాలు.
హాయైన సన్నటి పట్టుదారంలాంటి స్వరాన్ని తెచ్చి
గాలి అతడి మనసుకు ముడివేసింది.
ఆ స్వరం చూపిన వెలుగు సాయంతో
ఆ హాలుదాటి, వసారాదాటి
వరండాదాటి మెట్లుదాటి
జాజి పందిరి దాటి జామచెట్టుదాటి
చామంతులూ మందారాలూ దాటి
వెళ్ళితే -
అక్కడ
పారిజాతం చెట్టు క్రింద
అరుగు మీద
కూచుని
కళ్ళు మూసుకుని
పాడుతూంది
ఆమె !
వీనులవిందై
అమృతపు సోనల పొందై
పరమానందాను సంధానమై
పరుగెడుతూంది
ఆమె పాట
ఆ పాట ...

పారిజాతాల్లాంటి
పాపాయి నవ్వుల్ని
మెరుపు దారంతో కట్టి
ఒక దివ్యమంగళ భావ మూర్తికి
మాల వేసినట్లు ....
అలనాడు
కల్యాణవేళ
తలంబ్రాలు పోస్తుండగా
ఇవి మేలి ముత్తెములా -
నా జానకి నునుసిగ్గు దొంతరల చాటు దరహాసాలా
అని ఆలోచించిన
రామయ్య అంతరంగంలోని
ఆనంద తరంగాలట్లు
**When the morning stars**
**Sang together and**
**all the children of God**
**shouted for joy —** అన్నట్లు
ఆ పాట సాగి సాగి
ఆకారాన్ని కోల్పోయి
శబ్దమై, సాగరమై
అనంతమై
కెరటమై
కేరింతమై
గరుత్మంతుని రెక్కల సవ్వడియై

ఆకాశ మేఅయిపోగా

— పాడుతూంది ఆమె ....

ఆమె పాదాల దగ్గర

అరుగుకు జేరగిలబడి కూచున్నాడు

అతడు

అరెరె !

- ఇదేవిటి

తానిన్నాళ్ళు, ఇన్నేళ్ళు

కషించి, మోసి, చచ్చి, ప్రసవించి, బ్రతికిన

చిత్రాన్ని

ఈవిడ పాడుతూందేవిటి !

- కాదు కాదు

తానే ఇన్నాళ్ళు అదిపాటని తెలియక -

దాని స్వరూపం తెలుసుకోలేక -

చిత్రించబోయి

రూపం అందక

రంగులు తెలియక

కేన్వాస్ నిలవక

బాధపడ్డాడేమో ....

మనసు లోలకమైంది.

లోలకం బిందువైంది.

బిందువు నాదమైంది.

- ఆమె పాడుతూంది.

అతడు కూచునే వున్నాడు
ఆ పాటల తాళానికి
నాట్యం చేసిచేసి
అలసిన పారిజాతాలు
అప్పుడోటి
అప్పుడోటిగా
వారిమీద వర్షిస్తున్నాయి
So God created man in his own image
Male and female created he, them !
ఎన్నో జన్మల తర్వాత,
ఆ పాట ముగిశాక
రంగుల హరివిల్లు చేత పట్టుకుని ఆమె -
అనంతకోటిశబ్దాలను మింగిన నిశ్శబ్దాన్ని చేతగిలించి అతడు
వారిద్దరూ
వారిధి తెల్లజరీ అంచుమీదుగా
నడుస్తున్నారు
గలగలమని మాట్లాడుకుంటున్నారు
వాళ్ల పెదవులు నిశ్చలంగా వున్నాయి
సముద్రపు తరంగాలు తరంగమభినయిస్తున్నాయి
పకపకమని నవ్వుతున్నాయి.
ఆ నవ్వులు ఎగిరి ఆకాశం చేరుతున్నాయి
నక్షత్రాలై కూచుంటున్నాయి
అతడి కళ్ళల్లో ఆనందం చూచి
ఆమె

అటుచూస్తే - చందమామ !
సాగరకన్య పరిచిన వెండి తివాసీల మీదుగా
నడిచి రావడానికి సమాయత్త మౌతున్న
ఆనాటి నా వోడు సెందురూడు -
ఆ చంద్రుడే ఇక్కడా, ఇతడిలోనూ !!
విరబూసిన మల్లె పొదలో ఆమె
ఆమె వదనం వాకిట
ముంగురులతో గాలి పెడుతున్న
ముగ్గుల్ని చూచాడు అతడు
చూచి
అటు చూస్తే
చందమామ కడ్డంగా
మబ్బుల పీలికలు !
అందలంమీది ఆ చందమామను తానందుకోలేనని,
ఆ సువిశాల దిఙ్మండలాన్ని తాను పొదివి పట్టుకోలేనని,
ఆ ఆకాశాన్ని చేరుకోలేనని
ఆ గాలిని ఆక్రమించుకోలేనని
అదంతా ఆమెగా
తన దగ్గరగా
తన పక్కగా ఆమె
చెట్టాపట్టాలేసుకుని వాళ్ళిద్దరూ
నడకలతో పరుగెడుతూ,
పరుగులతో నడుస్తూ

తూలుతూ, వాలుతూ
తడబడుతూ, పడబోతూ
— తత్రైకస్థం జగత్కృత్స్నం
ప్రవిభక్త మనే కథా
అపశ్యద్దేవ దేవస్య శరీరే ....” —
— నీరూ నేలా కలిసిన అంచు మీంచి వెళ్తుంటే,
— ఆకాశం నేలను తాకేచోట వెండి మెరుపులు మెరుస్తుంటే
— గాలి నీటిని కితకితలు పెట్టగా ఆ సరసానికి కదలి
శత సహస్రకోటి తరంగాలై పొంగుతుంటే,
నీరు చల్లగాసాగి తన సుదీర్ఘ బాహుశ్రేణితో
భూకన్యను వెచ్చగా కౌగలించి
ఆమె మోవిని చుంబించగా
ఆకాశం
నేల
గాలి
నీరు
- అన్నీ కలిసి
ఒక
మహాద్భుత వర్ణ చిత్రంగా
నిశ్శబ్ద శబ్ద కావ్యంగా
అతిలోక మాధుర్యగానంగా
గానభరితమానంగా
అయిన

అక్కడ

అతడు

ఆమె !

ఇద్దరు కారువారు, ఒక్కరే ....

ఆ ఒక్కరూ ఏరీ ?

అణువంతయినా లేదు నీడ

అంతటా వున్నది వెన్నెలే ।

ఉన్నదంతా వెలుగే

పూర్ణమదం .... పూర్ణమిదం

నిఖిల సృష్టికి అది

నిండు పూర్ణిమ ! ।

---